
సాక్షి
బాపట్ల
మంగళవారం । 28 । జనవరి । 2025



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

విజయపురిసౌత్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నాగార్జునసాగర్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆటో డ్రైవర్లకు సోమవారం ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ కౌన్సెలింగ్ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 554.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,709 క్యూసెక్కులు వదిలారు.

సబ్ రిజిస్ట్రార్‌కు ఉత్తమ సేవా పురస్కారం



నరసరావుపేట టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 పీవీ నాగేశ్వరరావు ఆదివారం కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

వలస పక్షి విలాపం

ఖండాంతరాలు దాటి వెలమవారిపాలెం వచ్చే విదేశీ పక్షులు

ప్రతి ఏడాదీ ఆరు నెలలపాటు ఆ గ్రామం కొత్త బంధువుల రాకతో సందడిగా మారుతుంది. ఇంటికి చుట్టాలు రాకపోయినా పెద్దగా బాధపడరు గానీ ఆ ప్రత్యేక అతిథులు రాకపోతే మాత్రం గ్రామస్తులు అంతా గాబరా పడతారు. ఆ గ్రామమే బల్లికురవ మండలంలోని వెలమవారిపాలెం. ఆ బంధువులు ఎవరో కాదు అక్కడకు ప్రతిఏటా విచ్చేసే విదేశీ పక్షులే. అయితే ఈ ఏడాది వాటి జాడలేకపోవడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. గ్రామం చుట్టూ ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికివేయడంతో ఈ దుస్థితి దాపురించిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పక్షులను దూరం చేస్తున్న చెట్ల నరికివేతలు

- ఈ ఏడాది కనిపించని అతిథులు
- చెట్లు లేకపోవడంతో వచ్చివెళ్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు



గ్రామంలో చెట్లపై ఆవాసం ఏర్పరచుకున్న పక్షులు (ఫైల్)

బల్లికురవ: మండలంలోని వెలమవారిపాలెం గ్రామానికి శతాబ్దాలుగా నైజీరియా, కొరియా దేశాల నుంచి కొంగజాతి వైట్ స్ట్రోక్ రకానికి చెందిన పక్షులు వస్తున్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని ఈ గ్రామానికి పక్షుల రాక వందల సంవత్సరాల క్రితమే ఆరంభమైంది. డిసెంబర్ మాసాంతంలో గ్రామానికి వచ్చి, చెట్లను ఆవాసం చేసుకుని గుడ్లను పొదిగి పిల్లలకు రెక్కలు రాగానే జూలై మొదటి వారంలో తిరిగి స్వదేశానికి వెళ్తాయి. నైజీరియా, కొరియా దేశాల్లో జనవరి నుంచి జూన్ వరకు చలితీవ్రత అధికంగా ఉంటుంది. తరాలుగా ఆరు నెలలు ఇక్కడకు వచ్చి పిల్లలతో తిరిగి స్వదేశానికి వెళ్తున్నట్లు గ్రామస్తులు 'సాక్షి'కి తెలిపారు.

అతిథులను కంటికి రెప్పలా..

ఈ పక్షులను తామంతా అతిథులుగా భావిస్తామని. చిన్నపిల్లలు, వృద్ధులు సైతం వాటిని బంధువులుగా భావిస్తుంటారని,, పక్షుల జోలికి ఎవరు వెళ్లినా తాము సహించమని గ్రామస్తులు తెలిపారు. సంక్రాంతికి కొత్త అల్లుళ్లను చూసుకున్నట్లుగా ఈ పక్షులను చూసుకుంటామని, ఈ ఏడాది పక్షులు రానందున పండుగను ఆనందంగా జరుపుకోలేకపోయామని వాపోయారు. సుమారు 5000 కిలోమీటర్లపైన ఖండాంతరాలు దాటి 600పై చిలుకు పక్షులు వస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది రాకపోవడంతో తమ గ్రామానికి ఏమైనా అరిష్టం జరుగుతుందా అని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. జనవరి–జూన్ మధ్యలో పర్యాటకులు వస్తుంటారని, కొందరు వచ్చి నిరాశతో వెనుతిరిగి వెళ్లారని గ్రామస్తులు ఆవేదన వెలిబుచ్చారు.

చెట్లు లేకపోవడమే ప్రధాన కారణం

గ్రామ సచివాలయం నుంచి జమ్మలమడక కాలనీ వరకు వెళ్లే రోడ్డుకు తూర్పు, పడమర భాగాల్లోని ఖాళీ స్థలాల్లో సుమారు 150 నుంచి 200 వరకు వివిధ రకాల చెట్లు ఉండేవి. అయితే వీటిలో అధిక శాతం శతాబ్దాల క్రితం నాటివి కావడంతో అవి రోడ్లపైకి వరగడం, కూలిపోవడం జరిగింది. మిగతా కొన్నింటిని రోడ్ల విస్తరణ, ఇతరత్రా కారణాలతో కూల్చేశారు. దీంతో చెట్ల సంఖ్య 40కి పరిమితమయింది. ఈ చెట్లకు కొమ్మలు తక్కువగా ఉండడంతో పక్షులు గూళ్లు కట్టుకునేందుకు అనుకూలంగా లేవు. కూలిన, కూల్చిన చెట్ల స్థానంలో కొత్తవి నాటకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చెట్ల పెంపకాన్ని చేపట్టాలి. దీని కోసం అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. పచ్చని చెట్ల పెంపకం వల్ల పక్షులకు ఆతిథ్యంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వొచ్చు.

– నూనె ప్రభుదాస్, సర్పంచ్, వెలమవారిపాలెం

మొక్కలు నాటడమే పరిష్కారం



గ్రామ సచివాలయ సమీపంలో సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఏడాది క్రితం అప్పటి తహసీల్దార్ అశోక్‌వర్ధన్‌కు పక్షుల కోసం చెట్లు పెంచాలని విన్నవించడంతో అధికారులు ఆ భూమిని పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ చేసి చెట్లు పెంచుదామని ప్రకటించారు. తహసీల్దార్ బదిలీ, కూటమి ప్రభుత్వం రాకతో ఈ పనులు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ఈ భూమిలో చెట్లు పెంచితే పక్షుల మనుగడకు ఇబ్బందులు తొలగించి ఆశ్రయం కల్పించవచ్చు.

– టి.నరేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు, వెలమవారిపాలెం

రాత్రి 10 గంటలకు టెలీ కాన్ఫరెన్స్

పల్నాడు డీఈఓ వైఖరితో హెచ్‌ఎంల అసహనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలిపేందుకు ఉద్దేశించిన ప్రక్రియపై విద్యాశాఖాధికారులు చేస్తున్న హడావుడి ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు పేరుతో వేళాపాళా లేని సమావేశాలతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పల్నాడు డీఈవో చంద్రకళ సోమవారం రాత్రి 10 గంటల సమయంలోనూ జిల్లాలోని వివిధ మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. పగటిపూట నిర్వహించాల్సిన సమావేశాన్ని రాత్రి 8.30 నుంచి ప్రారంభించిన డీఈఓ 10 గంటల సమయానికి కంటిన్యూ చేయడంతో ఎంఈఓలు, హెచ్‌ఎంలు తలలు పట్టుకున్నారు. పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల్లో పని చేస్తూ గుంటూరులో నివసిస్తున్న హెచ్‌ఎంలు ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లాల్సి ఉండగా, డీఈఓ వైఖరితో విసుగు చెందుతున్నట్లు వాపోతున్నారు. నిద్రకు ఉపక్రమించాల్సిన సమయంలో టెలి కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, ఆమేషాలపై తేల్చాల్సిన విషయం కాదు కదా అని పెదవి విరుస్తున్నారు.

29 ఎయిడెడ్ స్కూళ్లకు నోటీసులు జారీ

బాపట్లటౌన్: జిల్లా పరిధిలోని 40 మంది లోపు విద్యార్థులు ఉండి ముగ్గురికి పైగా ఉపాధ్యాయులు ఉన్న ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ జిల్లాలోని 29 ఎయిడెడ్ పాఠశాలలకు సోమవారం డీఈఓ పురుషోత్తం నోటీసులు జారీ చేశారు. గత మూడు సంవత్సరాల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదల చేయని కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆయా పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు మార్పు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ఫీజు చెల్లించుకునే గడువును మార్పు చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత అభ్యర్థులు ఫీజు చెల్లించవచ్చని సూచించారు. రూ.100 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించవచ్చని తెలిపారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

సాక్షి స్పెల్‌బీలో సత్తా చాటిన మాంటిస్సోరి విద్యార్థిని



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ''సాక్షి'' స్పెల్‌బీ పోటీల్లో శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్లో 4వ తరగతి చదువుతున్న టి. హన్విక ప్రభాద్ నాలుగో ర్యాంకు కైవసం చేసుకున్నట్లు పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్ తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. గత వారం హైదరాబాద్‌లో జరిగిన సాక్షి స్పెల్‌బీ ఫైనల్స్‌లో భాగంగా కేటగిరీ–2 విభాగంలో పోటీ పడిన తమ విద్యార్థిని హన్విక ప్రభాద్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు సాక్షి మీడియా గ్రూప్ నిర్వహిస్తున్న స్పెల్‌బీ విద్యార్థుల ప్రగతికి బాటలు వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యార్డుకు లక్షకు పైగా మిర్చి బస్తాలు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి మార్కెట్ యార్డుకు ఈ సీజన్‌లో అత్యధికంగా సోమవారం 1,12,021 బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,02,511 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.10,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.8,000 నుంచి రూ.13,800 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.14,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,498 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో గొడవర్రు సర్పంచ్‌కి అవార్డు



గొడవర్రు(చేబ్రోలు): ఢిల్లీలో జరిగిన76 గణతంత్ర వేడుకలలో కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నుంచి చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను అభినందించారు. జానకీదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించి, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసినందుకుగాను కేంద్ర ప్రభుత్వం గౌరవ పురస్కారంఅందజేసినట్లు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి 700మంది సర్పంచ్‌లను ఆహ్వానించారని, ఇందులో ప్రతిభ కనబరిచిన 11 మంది సర్పంచులను ఎంపిక చేసినట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి గొడవర్రు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తనను ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఇంచార్జి ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి ఆమెను అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1716 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 126, బ్యాంక్ కెనాల్‌కు 176, తూర్పు కెనాల్‌కు 250, పశ్చిమ కెనాల్‌కు 188, నిజాంపట్నం కాలువకు 60 క్యూసెక్కులు విడుదల చేశారు.

బాలుడి చికిత్సకు రూ.2 లక్షలు అందజేత



బాలుడికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

చీరాల అర్బన్: మానవత్వం పరిమళించింది. ఆపదలో ఉన్న బాలుడి పరిస్థితిని గమనించిన కొందరు యువకులు ఆపన్నహస్తం అందించారు. బాలుడి వైద్యసహాయం నిమిత్తం రూ.2 లక్షల నగదు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా పేర్నమిట్టకు చెందిన హనీష్ అనే 12 ఏళ్ల బాలుడు సంక్రాంతి పండుగ రోజున గాలిపటం ఎగరవేస్తూ విద్యుదాఘాతానికి గురై కుడిచేతిని పోగొట్టుకున్నాడు. ఈక్రమంలో చీరాలలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మేఘనా మెడికల్స్ మద్దాల హేమంత్‌కుమార్ తన స్నేహితులతో కలిసి చర్చించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు నడుం బిగించారు. స్నేహితులు కామాక్షి మెడికల్ డిస్ట్రిబ్యూటర్ రాఘవ, రఘురామిరెడ్డి, భాస్కరరెడ్డి, శంకర్, వంశీరెడ్డి, రేవంత్, సిబ్బంది అందరితో కలిసి హాస్పిటల్‌లో బాలుడిని పరామర్శించి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాలుడి స్థితిని తెలుసుకుని సాయం చేసిన యువకులకు బాలుడి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

సాగర్ జలాలను వృథా చేయొద్దు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి రూరల్: సాగర్ జలాలు కాలవలకు సరఫరా చేసే సమయంలో వృథాగా పోకుండా షట్టర్లు, లాకులతో పరిరక్షించుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కామేపల్లి కల్యాణ మండపంలో సాగర్ నీటి సంఘాల చైర్మన్లు, అధ్యక్షులు, డైరెక్టర్‌లు, ఇరిగేషన్ అధికాలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒకే సమయంలో కాకుండా జోన్‌ల వారీగా నీటిని విడుదల చేయాలని సూచించారు. కాలవలపై కష్టపడి పనిచేసే వారితోనే లస్కర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులకు తెలిపారు. ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి, ఈఈ రామకృష్ణ, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ వెంకటమురళి



బాపట్లటౌన్: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 121 మంది కలెక్టర్‌కు తమ సమస్యలు తెలియజేశారు. అనంతరం జిల్లాలోని అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు, సర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలలో 3400 అర్జీలు ఆడిటింగ్‌కు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి 100 శాతం పరిష్కరించాలన్నారు. బాపట్ల, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీల పరిష్కారం పై ఒక టీం ని ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవో లను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం, హైటీ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 30న బాపట్లకు 20 సూత్రాల చైర్మన్ లంక దినకర్ వస్తున్నారన్నారు. కేంద్ర పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. జిల్లా జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ డి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ బట్టు పాల్గొన్నారు.

ప్రతి శనివారం స్వచ్ఛత దివస్...

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి శనివారం స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని పక్కాగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతంలో సోమవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్తాచెదారం ఉండరాదని, కార్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పలు శాఖల కార్యాలయాల భవనాలను ఆయన పరిశీలించారు. ఈటీసీకి చెందిన ఆరు క్వార్టర్స్ భవనాలు, నిరుపయోగంగా ఉన్న భవనాలు వినియోగంలోకి తెచ్చేలా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. 730 సర్వే నెంబర్‌లోని భూమి వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆర్డీఓను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతమైన 57.13 ఎకరాల భూమిని సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సర్వే ల్యాండ్స్ ఏడీని ఆదేశించారు.

పాడై పోతోంది !

చీరాలలో అక్రమ డైయింగ్ యూనిట్లు

- వస్త్రాలకు డై వేస్తూ రసాయనాలను భూమిలోకి వదులుతున్న వైనం
- ఫలితం.. ప్రమాదభరితంగా మారిన భూగర్భ జలాలు
- తమిళనాడు నుంచి వచ్చి డైయింగ్ యూనిట్ల ఏర్పాటు
- కాలుష్య కోరల్లో చీరాల
- పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు



చీరాలలో వస్త్రాలకు డై వేస్తున్న కార్మికులు

చీరాల: అందాల చీరాల కాలుష్య కాసారంగా మారిపోయింది. తమిళనాడులో నిషేధించిన డైయింగ్ యూనిట్లు ఇప్పుడు నేరుగా చీరాలలో తిష్ట వేశాయి. కనీసం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్భయంగా తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక యజమానులు భారీ డైయింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి తమిళనాడులోని వస్త్రాలకు చీరాలలో డైలు చేస్తున్నారు. ఇవి ఏదో చేనేతకు సంబంధించిన నూలు కాదు. ఏకంగా ఫ్యాబ్రిక్స్ (బనియన్లు, టీ షర్టులు, ఇతర రెడీమేడ్ వస్త్రాలు) డైలు వేసి కెమికల్స్ వ్యర్థాలను చీరాల భూముల్లో వదిలేస్తున్నారు. దాదాపు ఏడాదికి పైగా ఈ అక్రమ డైయింగ్ యూనిట్ల వ్యవహారం జరుగుతున్నా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు వీరిపై చర్య తీసుకోకపోవడం విశేషం. అలానే స్థానికులు కొందరు భారీ డైయింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. వీటిని నామమాత్రపు అనుమతి కూడా లేకుండా నిర్వహిస్తున్నారు.

అక్కడ నిషేధం.. ఇక్కడ ఇష్టానుసారం

ఇదిలా ఉంటే ఏడాది నుంచి తమిళనాడుకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి 15 మంది వ్యాపారులు చీరాలలో డైయింగ్ యూనిట్లను అక్రమంగా పెట్టారు. తమిళనాడులోని తిరుపూరు, సేలం, ఈ–రోడ్, కోయంబత్తూరు, కంచి, నగరి, కుంభకోణం, ఆరణి వంటి ప్రాంతాలలో డైయింగ్ యూనిట్లను నిషేధించారు. వీటి నుంచి వచ్చే విషపూరితమైన కలుషిత నీరు భూగర్భజలాల్లో చొరబడి, భూగర్భజలాలను విషపూరితంగా మార్చి ఫలితంగా ప్రజల ప్రాణాలు పోతున్నాయన్న ఉద్దేశంతో అక్కడి ప్రభుత్వం పూర్తిస్థాయిలో యూనిట్లపై దృష్టి పెట్టింది. కలుషిత నీటిని శుద్ధిచేసే ప్లాంట్లు ఉంటేనే డైయింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలనే ఖచ్చితమైన నిబంధన విధించింది. ఈ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు పెట్టాలంటే రూ.కోట్లతో కూడుకున్న పని. దీంతో చీరాలలో అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని ఏకంగా 15 మంది బడా వ్యాపారులు వచ్చి భారీ డైయింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. అక్కడ అమ్మే వస్త్రాలకు చీరాలలో డైలు వేసి మరలా వాటిని అక్కడికే తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని ఈపూరుపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు 50 వరకు ఈ యూనిట్లు ఉన్నాయి.

విషపూరితం అవుతుందిలా..

చీరాల ప్రాంతంలో ఉన్న డైయింగ్ యూనిట్ల నుంచి రోజుకు 50 లక్షల లీటర్లకు పైగానే వివిధ రసాయనాలు, ఇతర వ్యర్థ పదార్థాలు భూగర్భజలాల్లోకి చేరుతున్నాయి. సుమారు ఒక్కో డైయింగ్ యూనిట్‌లో మూడు నుంచి నాలుగు వేల కిలోల వస్త్రాలకు డైయింగ్ వేస్తారు. ఒక కిలో వస్త్రానికి డై వేయాలంటే రెండు వందల లీటర్ల కెమికల్స్‌తో కూడిన నీటిని వినియోగిస్తారు. ఆ తర్వాత వాటిని నేరుగా కుందేరు లేదా ఆ పక్కనే ఆ నీటిని వదిలేస్తున్నారు. ముఖ్యంగా కొన్ని యూనిట్లు విడుదల చేస్తున్న నీటిని పరిశీలించగా విషపూరిత నీటితీవ్రత ఏ స్థాయిలో ఉందో చూసి అధికారులే ఖంగు తిన్నారు.

సంభవించే ప్రమాదాలివే...

ఈ విషపూరితమైన నీరు నేరుగా పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లోకి చేరుతుంది. ఈ నీటిని ప్రజలు తాగడం వలన కిడ్నీకి సంబంధించిన వ్యాధులు వస్తాయి. నీటిలో ఉప్పు శాతం పెరిగిపోతుంది. దాని వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు జీర్ణవ్యవస్థ దెబ్బతిని జీర్ణకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉంది. అలానే బావులు, బోర్లలోని నీరు మందంగా మారుతాయి. నీటిలో ఆక్సిజన్ శాతం పడిపోతుంది. దీని వల్ల చేపలు, రొయ్యలతో పాటు సముద్ర జీవులు చనిపోతాయి. పంట పొలాలు సైతం దెబ్బతింటాయి.

విడుదలవుతున్న నీరు అత్యంత విషపూరితం

	ఉండాల్సినది (మిల్లీ గ్రాములు)	ఉన్నది (మిల్లీ గ్రాములు)
టీడీఎస్(టోటల్ డిజాల్వ్ సాలిడ్)	2100	40,000
సీఓడీ(కెమికల్ ఆక్సిజన్ డిమాండ్)	250	4000
సస్పెండెడ్ సాలిడ్స్	100	1800

నిబంధనలకు నీళ్లు

డైయింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుగా సీఎస్టీ అనుమతిని కాలుష్య నియంత్రణ బోర్డు ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. యూనిట్ పెట్టే స్థలం అందుకు అనుకూలమైందా, స్థానికులకు ఇబ్బందులు ఏర్పడతాయా అనేది పరిశీలన జరగాల్సి ఉంటుంది. ఆ తర్వాత పరిశ్రమకు సంబంధించిన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తప్పకుండా యూనిట్ల నుంచి విడుదలయ్యే కలుషిత నీటిని శుద్ధి చేసేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

జాతీయ పతాకానికి అవమానం



నగరం: జాతీయ జెండాకు అవమానం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించిన జాతీయ జెండాను అవనతం చేయకుండా గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. వివరాల్లోకి వెళితే.. నగరం మండలం అద్దంకివారిపాలెం గ్రామ పంచాయతీలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే సాయంత్రానికి అవనతం చేయాల్సి ఉన్నా సోమవారం మధ్యాహ్నం వరకు పంచాయతీ కార్యాలయంపై జాతీయ జెండా ఎగురుతూనే దర్శనమిచ్చింది. జాతీయ జెండాను అవనతం చేయకుండా నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పసుపు రైతుల సమస్యపై అధికారిక సమావేశం

రైతు సంఘ ప్రతినిధులతో సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: నష్ట పరిహారం జాప్యం కారణంగా దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీ అగ్ని బాధిత పసుపు రైతులు మానసిక ఆందోళనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. రైతులు, అధికారులు, కోల్డ్ స్టోరేజీ యజమాన్యం సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సంజనా సింహ అర్జీలను స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు ములకా శివకుమారి అగ్నిబాధిత పసుపు రైతుల సమస్యలపై అర్జీనిచ్చారు. దేవదాయ శాఖ కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వం ఇచ్చే పరిహారం, సబ్సిడీలు అందక నష్టపోతున్నారని వారు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటితోపాటు నియోజకవర్గంలోని కొల్లిపర, గుడివాడ దళితవాడలకు సంబంధించి శ్మశానస్థలం కోసం స్థానికుల ఆందోళనను వివరించారు. సంగంజాగర్లమూడి–అంగలకుదురు మధ్య గుంటూరు రోడ్డు, తెనాలి–మంగళగిరి, గుంటూరు–హనుమాన్‌పాలెం రహదారుల్లో గుంతలతో ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారనీ, సత్వరమే గుంతలు పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొల్లిపర మండలం చివలూరులో చేతిపంపులు ఏర్పాటు ఆవశ్యకతను విన్నవించారు. సమస్యలను సావధానంగా విన్న సబ్ కలెక్టర్ పరిష్కారం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

రైతులను నట్టేటముంచిన ప్రభుత్వం

- మద్దతు ధరలేదు.. ధాన్యం కొనుగోలు చేసే నాథుడే లేరు
- గిట్టుబాటు ధర కల్పించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మాజీ డెప్యూటీ స్పీకర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోన రఘుపతి పేర్కొన్నారు. మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వం కనీసం రైతుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవని కోన ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ధాన్యానికి రూ.1700 మద్దతు ధర ఉంటే ఇప్పుడు రూ.1400కు కొనుగోలు చేసే దిక్కే లేరన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్‌బీకేల ద్వారా ఈ–క్రాప్ బుకింగ్ చేపట్టి విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. గతేడాది ఈపాటికే ధాన్యం రూ.1900–2000 వరకు అమ్మితే ఈ ఏడాది రూ.1410–1420కు కొనుగోలు చేసే వారేలేరన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్‌యార్డు ద్వారా నిత్యం మానిటరింగ్ చేయటం జరిగిందన్నారు. మద్దతు ధర విషయంలో అనునిత్యం రైతులకు, అధికారులకు మధ్య వారధిగా అప్పటి మార్కెట్ యార్డు చైర్మన్లు పనిచేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ధాన్యం కొనుగోలు విషయంలో జోక్యం చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటకు వెంటనే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోళ్లు ప్రారంభించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోన హెచ్చరించారు. రైతులు ఎక్కడ చూసినా తాము పండించిన ధాన్యం అటు అమ్ముకోలేని, ఇటు నిల్వ చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని కోన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు కొండలురెడ్డి, యల్లావుల ఏడుకొండలు, నాయకులు దొంతిబోయిన సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, గంగిశెట్టి రత్తయ్య, కొలిక్కిలిగడ్డ చెంచయ్య, హుస్సేన్, మండే విజయ్‌కుమార్, పిన్నిబోయిన ప్రసాద్, కటికల యోహోషువా తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్‌లో బాపట్ల కానిస్టేబుల్ ప్రతిభ

కానిస్టేబుల్ బ్రహ్మారెడ్డిని అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ



కానిస్టేబుల్ నాగ బ్రహ్మారెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: విధులతోపాటు క్రీడల్లోనూ పోలీస్ సిబ్బంది సత్తా చాటాలని ఎస్పీ తుషార్‌డూడీ సిబ్బందికి సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ప్రోత్సహిస్తామన్నారు. బాపట్ల జిల్లా చుండూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పిట్టు నాగ బ్రహ్మారెడ్డిని సోమవారం ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందర్‌లో జాతీయ స్థాయిలో జరిగిన 'ఆల్ ఇండియా సీ స్విమ్మింగ్ కాంపిటీషన్' లో 2 కిలోమీటర్ల దూరాన్ని 40 నిమిషాల్లో, 5 కి.మీ దూరాన్ని 2.02 గంటల్లో ఈదుకుంటూ వెళ్లి నాగబ్రహ్మారెడ్డి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. గత సంవత్సరం నవంబర్‌లో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో జరిగిన '4వ నేషనల్ ఓపెన్ వాటర్ ఛాంపియన్‌షిప్' పోటీలలో 5 కి.మీ దూరాన్ని 1.34 గంటల్లో ఈది సిల్వర్ మెడల్ పొందినాడు. గత సంవత్సరం డిసెంబర్ నెలలో మహారాష్ట్ర లోని మాల్వాన్ లోని చివల్ బీచ్ లో జరిగిన '10 కి.మీ ఓపెన్ సీ స్విమ్మింగ్ రేస్' ను 2.07 గంటల్లో పూర్తి చేసి జాతీయ స్థాయిలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని చాటాడన్నారు. స్విమ్మింగ్ లో మొత్తం నాలుగు మెడల్స్ సాధించడం గర్వకారణమన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టడం అందరి బాధ్యత

ఏపీ ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

తాడేపల్లి రూరల్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని ఏపీ ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆకే రవికృష్ణ మాట్లాడుతూ నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు జరుగకుండా నియంత్రించడమే అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను ఈగల్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడిన సందర్భంలో వారికి ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి తెలియజేయాలని కోరారు. మాదక ద్రవ్యాలబారిన పడిన బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన కల్పించుకుని దాన్ని ఇతరులకు తెలియజేయాలని సూచించారు. గంజాయి కేసులో అరెస్ట్ అయిన వారిని నేరస్తులుగా జీవితకాలం పాటు గుర్తింపు కలిగి ఉంటారని తెలిపారు. గంజాయి విక్రయించిన వారికి, వినియోగించిన వారికి ప్రత్యేక సెక్షన్ల ద్వారా శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్, నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, వర్సిటీ వీసీ కె. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రాజశేఖరరావు, వర్సిటీ రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, అసోసియేట్ డీన్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని పాల్గొన్నారు.

'రాతే మన భవిత' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈఓ రేణుక, ఖాసిం, ఉప్పాల రామమోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సులభ పద్ధతుల్లో చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునే విధంగా గుంటూరు రూరల్ పాత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఉప్పాల రామమోహనరావు రూపొందించిన 'రాతే మన భవిత' పుస్తకాన్ని సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కె.రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈఓ సీవీ రేణుక ఆవిష్కరించారు. సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పాల రామమోహనరావు ఉపాధ్యాయులతో కలసి ఏర్పాటు చేసిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. గుంటూరు జిల్లాలో చేపట్టిన చేతిరాత ఉద్యమాన్ని ఇతర జిల్లాలకు విస్తరింపచేసిన క్యాలిగ్రఫీ టీం వేలాది మందికి శిక్షణ కల్పించడం ప్రశంసనీయమని తెలిపారు. డీఈఓ సీవీ రేణుక మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. పుస్తక రూపకర్త ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా క్యూఆర్ కోడ్‌తో తీసుకువచ్చిన పుస్తకాన్ని స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేయగానే బోర్డుపై అక్షరాలను రాసే వీడియోలు ప్రత్యక్షమవుతాయని చెప్పారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, క్యాలిగ్రఫీ టీం ఈ.అనిల్‌కుమార్, ప్రసాద్, శారద, శైలజ, షాజీర్, బురాన్, నాగలక్ష్మి, నాగమణి, అన్నపూర్ణ, పుష్ప, సత్యనారాయణ, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

అర్జీదారులతో మర్యాదగా మెలగాలి

- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ
- పీజీఆర్ఎస్‌కు 51 అర్జీలు



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ

బాపట్లటౌన్: అర్జీదారులతో సహృదయంతో వ్యవహరించి, మర్యాదగా మెలగాలని ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో సంతృప్తికర రీతిలో పరిష్కరించాలన్నారు. అర్జీ దారులతో సహృదయ భావనతో వ్యవహరించినప్పుడే వారి సమస్య, వారు పడే ఆవేదన అర్థం అవుతుందన్నారు. అప్పుడే వేగంగా స్పందించి సమస్యలు పరిష్కరించగలమన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి 51 మంది బాధితులు ఎస్పీకు తమ సమస్యలు తెలియజేశారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురనేని అభ్యుదయ సాహిత్యం నేడు అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహిత్యావసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో సోమవారం కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి సాహితీ సమితి అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షతన పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగునాట ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని సృష్టించి, నూతన ఆలోచనలను అందించిన హేతువాద ఉద్యమనేత త్రిపురనేని అని కొనియాడారు. రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించి, అంధ, మూఢ విశ్వాసాలను పాలకపక్షాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. సాంస్కృతిక పునరుజ్జీవనం ఎంతో అవసరమని, అందుకు త్రిపురనేని కృషిని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. సాహితీ సమితి కార్యదర్శి వల్లూరు తాండవకృష్ణ మాట్లాడుతూ స్వయంకృషితో పెనుగొండ లక్ష్మీనారాయణ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారని అన్నారు.కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ ఫోరం నాయకుడు పీవీ మల్లికార్జునరావు, రావెల సాంబశివరావు, జొన్నలగడ్డ రామారావు, పాటిబండ్ల విష్ణువర్ధన్, జీవీ రాయుడు పాల్గొన్నారు.

రేపు త్రిపురనేని శత జయంతి సభ

కవిరాజు త్రిపురనేని రామస్వామి సూత పురాణం రాసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 29న ఉదయం 10 గంటలకు జేకేసీ కళాశాల ఆడిటోరియంలో శత వసంతాల వేడుక నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు, ప్రజా సాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబుకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

31నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'బాల మహోత్సవ్'

- చిన్నారులకు రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు పోటీలు
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మెగా వేడుకలు
- విజయవంతం చేయాలన్న విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

చేబ్రోలు: చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1 వరకు రెండు రోజుల పాటు విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించే ''విజ్ఞాన్ బాల మహోత్సవ్–2కే25'ను విజయవంతం చేయాలని వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో సోమవారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుండి 10వ తరగతి లోపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొనవచ్చని తెలిపారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు విజ్ఞాన్ బాల మహోత్సవ్ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని సూచించారు.



50కు పైగా ఈవెంట్ల నిర్వహణ ..

విజ్ఞాన్ యూనివర్సిటీ తొలి సారిగా నిర్వహిస్తున్న బాల మహోత్సవ్‌లో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లను నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ ఫీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4 x 100 మీటర్ల రిలే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4 గ100 మీటర్ల రిలే పోటీలు ఉంటాయని తెలిపారు. వీటితో పాటు మ్యూజిక్ (క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్–లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్‌స్ట్రుమెంట్ సోలో), డాన్స్ (క్లాసికల్, వెస్టన్, ఫోక్ (గ్రూప్), లిటరరీ (ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ (స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్) పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రైలు కింద పడి బాలిక మృతి

పెదకాకాని: రైలు కిందపడి బాలిక మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని గ్రామానికి చెందిన వేములకొండ హారిక నారాకోడూరు శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. ప్రస్తుతం పెదకాకానిలో అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటూ కళాశాలకు వెళ్తోంది. ఆరు నెలల కిందట తాతయ్య కొండలరావు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హారిక అమ్మమ్మ వాణి వద్దనే ఉంటోంది. కొంతకాలంగా హారిక మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో కళాశాల కూడా సక్రమంగా వెళ్లేది కాదు. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న రైలు బండి కింద పడి బాలిక మృతి చెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. మృతురాలు వేములకొండ హారిక(17)గా గుర్తించారు. సంఘటన స్థలానికి రైల్వే పోలీసుల చేరుకొని మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు. మృతురాలి బాబాయ్ మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రేవతికి రజతం



తెనాలి: పట్టణానికి చెందిన పవర్‌లిఫ్టర్ వక్కలగడ్డ రేవతి మరో జాతీయ పోటీల్లో సత్తా చాటారు. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దల్లిరాజర జిల్లాలో ఇటీవల జరిగిన సుబ్రతా క్లాసిక్ నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సాధించారు. ఈ పోటీల్లో 76 కిలోల విభాగంలో తలపడిన రేవతి, స్క్వాడ్‌లో 135 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 57.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 130 కిలోల బరువుల నెత్తి ద్వితీయ స్థానంలో నిలిచారు. రేవతి స్థానిక లాట్స్ జిమ్‌లో కోచ్‌గా పని చేస్తున్నారు.

అద్భుతాలకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు

- దేవుడు ఈ లోకానికి వెలుగై ఉన్నాడు !
- ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు ప్రభువు పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి
- బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్
- దైవ సందేశాలతో తన్మయత్వం పొందిన విశ్వాసులు



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

పెదకాకాని: సకల జనులకు అద్భుతాలకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలిచాయని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ అన్నారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో ఫాదర్ ఎం. దేవదాసు అయ్యకు దేవుడు బయలపరిచిన 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రోత్సాహపరిచేలా సాగిన దైవ సందేశాలతో భక్తులు తన్మయత్వం పొందారు. ప్రధానంగా మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ కొనసాగించిన దైవ సందేశం భక్తులలో విశ్వాసాన్ని నింపింది. ఈ సందర్భంగా ఆయన యేసుక్రీస్తు చేసిన అద్భుతాలను ఉదహరించారు. ఆనాటి యెరికో పట్టణంలో అంధుడు తనకు చూపు ప్రసాదించమని విశ్వాసంతో ప్రార్థించగా, అతని జీవితంలో ఏసుక్రీస్తు ప్రభువు అద్భుత కార్యాలు చేసినట్లు వివరించారు. దేవుని గురించి వినుట, విశ్వసించుట ద్వారా మాత్రమే అతడు కంటి చూపు పొందినట్లు చెప్పారు. తనపై దేవుడు చూపిన కృపను వ్యర్థపరచకుండా ఆయనను మహిమపరుస్తూ వెంబడించినట్లు తెలిపారు. దానిని బట్టి అనేకులు దేవదేవుడైన ప్రభువును స్తుతించారన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాన అంశాలను భక్తులకు వివరించారు. కనులు ఉన్నా ఆధ్యాత్మిక అంధులుగా జీవిస్తున్న మన జీవితాలు వెలుగుమయం కావాలంటే దేవుని వాక్యం వినడం, విశ్వసించటం, విధేయత కలిగి జీవించటం వంటి ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా జీవ వాక్యంతో లోకమందు జ్యోతులవలె ప్రతి ఒక్కరు ప్రకాశించాలని కోరారు.

దేవుని వారసులం... పరలోక పౌరులం

ప్రేమ, దయ వాక్కులతో ఎంతోమందికి అద్భుత కార్యాలు చేసిన ఏసుక్రీస్తు ప్రభువుకు మనం నిజమైన వారసులమని, పరలోక పౌరులని పేర్కొన్నారు. బైబిల్ మిషన్‌కు వారసత్వం గుంటూరు కేంద్రంగా ఉన్న బైబిల్ మిషన్ మాత్రమే కలిగి ఉందని సభా ముఖంగా నినదించారు. భగవంతుడు మన జీవితాల కోసం చేస్తున్న అనేక అద్భుతాలకు కృతజ్ఞులై ఉండాలని తెలిపారు.

ఆకట్టుకున్న దైవ సందేశాలు

ముందుగా తూర్పుగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించింది. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ, రెవరెండ్ డి. సుధాకర్, రెవరెండ్ కె. ఏసురత్నం, రెవరెండ్ ఎన్. సత్యంబాబు, రెవరెండ్ మహిమాకర్షణ కుమార్, రెవరెండ్ సీహెచ్. షాలేము శరత్ తదితరులు దైవ సందేశాలు అందించారు. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ , వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి. జాన్ దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ కె. ప్రశాంత్ కుమార్ , జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి. సుధాకర్, రెవరెండ్ జె. ఆగమనరావు, రెవరెండ్ ఎం. సజీవరావు, గవర్నింగ్ బాడీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



ఏర్పాటు చేసిన భారీ వంటశాల

నేటి షెడ్యూల్..

మంగళవారం తెల్లవారుజామున ధ్యానం, కృష్ణాజిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనల ఆలాపన, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి. జాన్ దేవదాసు, జాయింట్ సెక్రటరీ రెవరెండ్ జె. ఆగమనరావు, సాయంత్రం రెవరెండ్ జె. వినోద్ కుమార్, పాస్టర్లు జి. శామ్యూల్, వి. సతీష్‌బాబు తదితరులు దైవ సందేశాలు అందిస్తారు.

పెదకాకాని స్వస్తిశాలకు పెరిగిన భక్తుల తాకిడి ..

బైబిల్ మిషన్ మహోత్సవాలకు హాజరైన భక్తులు పెదకాకాని స్వస్తిశాలకు తరలి వెళ్లడంతో అక్కడ భక్తుల తాకిడి పెరిగింది. భక్తిశ్రద్ధలతో స్వస్తిశాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహోత్సవాలకు హాజరైన ప్రతి ఒక్కరు పెదకాకాని తోటకు వెళ్లడం, దేవుణ్ని ప్రార్థించటం తరతరాలుగా వస్తున్న సంప్రదాయంగా ఉంది.

హాజరైన ప్రముఖులు..

బైబిల్ మిషన్ మహోత్సవాలకు సోమవారం మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనంద్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు తదితరులు హాజరయ్యారు. ప్రముఖులకు నిర్వాహకులు దేవదేవుని ఆశీర్వాదాలు అందించారు.